రైతు రుణమాఫీ ఎప్పుడో?

రుణమాఫీ సకాలంలో అమలుకాక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 2020లో రుణమాఫీ ప్రక్రియను రూపొందించినప్పటికీ అమలులో ఎడతెగని జాప్యం జరుగుతోంది. లక్ష రూపాయల లోపు పంట రుణాలను నాలుగు విడతల్లో నాలుగేళ్లలోగా మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించినా ఆచరణలో అమలుకు నోచుకోలేదు. దీంతో రైతులకు కొత్త రుణాలు అందడం లేదు. ఎప్పటిలాగే సాగు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

- అన్నదాతకు తప్పని నిరీక్షణ
- మాఫీ కాదేమోనని రెన్యూవల్ చేసుకోని వైనం
- బకాయిదారులుగా ముద్రవేస్తున్న బ్యాంకులు

మొయినాబాద్ రూరల్: పంట రుణమాఫీకి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అప్పులు రెన్యూవల్ చేసుకుంటే మాఫీ వర్తించదేమోననే భయంతో చాలా మంది రైతులు బ్యాంకుల వైపు కన్నెత్తి చూడడం లేదు.. ఫలితంగా బ్యాంకులకు రుణభారం అలాగే ఉండిపోగా రైతులను బకాయిదారులుగా గుర్తిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో పొలాల్లో నల్లమట్టిని పోయించడం, పశువుల పేడను తరలించడం చేస్తున్నారు. కొందరు రైతులు సోయా, మొక్కజొన్న, వరి విత్తనాలను సేకరించే పనిలో ఉన్నారు. సాగు కోసం అవసరమైన పెట్టుబడులను రైతులు సమకూర్చుకోవాల్సి ఉంది. రుణమాఫీ ప్రకటించక ముందు పంటలపై వచ్చిన ఆదాయంతో రుణం చెల్లించేవారు. సీజన్ ఆరంభానికి ముందు మళ్లీ బ్యాంకుల నుంచి అప్పు పొందేవారు. 2018 ఎన్నికల సందర్భంగా మరోసారి అధికారంలోకి వస్తే రూ.లక్ష వరకు పంట రుణమాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో రైతులు బ్యాంకులకు రుణాలు కట్టడం లేదు. మాఫీ కాదేమోనని రెన్యూవల్ కూడా చేసుకోవడం లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మాఫీ కాక రైతుల ఇబ్బందులు పడుతున్నారు. తొలుత రూ.25వేల లోపు, రెండో విడతలో రూ.50వేల లోపు రుణం బకాయి ఉన్నవారికే పంట రుణం మాఫీ అయింది. 2022–23 బడ్జెట్‌లో రూ.75వేల లోపు బకాయి ఉన్నవారికి పంట రుణం మాఫీ చేస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు వీరికి రుణ మాఫీ కాలేదు. జిల్లాలో 3.62 లక్షల మంది రైతులకు రూ.1,790 కోట్ల పంట రుణం మాఫీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇప్పటి వరకు రూ.25వేల లోపు బకాయి ఉన్న 18,211 మందికి, రూ.50వేల లోపు రుణం బకాయి ఉన్న 27,601 మందికి మాఫీ చేశారు. రూ.75వేల లోపు రుణం బకాయి ఉన్నవారు 25వేల మంది ఉంటారని అంచనా. పంటల సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్న తరుణంలో పెట్టుబడుల కోసం వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో పంట రుణం మాఫీని పూర్తిగా అమలు చేస్తే ఊరట లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. లేకపోతే, ఎప్పటిలాగే సాగు పెట్టుబడి కోసం అధిక వడ్డీ చెల్లించి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.



మొయినాబాద్‌లో సాగు చేసిన టమాట పంట

రైతుల అవస్థలను అర్థం చేసుకోవాలి



ప్రభుత్వం రైతుల అవస్థలను అర్థం చేసుకోవాలి. పెట్టుబడుల కోసం ఫైనాన్స్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. రుణమాఫీ చేస్తే ఎంతో ఊరట లభిస్తుంది.

– మహేందర్ ముదిరాజ్, రైతు, బాకారం

మాట నిలబెట్టుకోవాలి



రుణమాఫీపై ప్రభుత్వం తన మాటను నిలబెట్టుకోవాలి. 2018లో మరోసారి అధికారంలోకి వచ్చినా పంట రుణమాఫీ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది.

– దర్గా మహేందర్ ,పీఏసీఎస్ మండల వైస్ చైర్మన్

కనుల పండువగా బొడ్రాయి, ధ్వజస్తంభ పునఃపతిష్ఠాపన

షాబాద్: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన, దైవ భక్తి కల్గి ఉండాలని కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సంకెపల్లిగూడలో హనుమాన్ దేవాలయంలో బొడ్రాయి, ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. దేవాలయాలకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. దేశ సాంస్కృతిక సంపద, వారసత్వ సంపద పెంచడం కోసం ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దర్శన్, ఎంపీటీసీ చెన్నయ్య, ఉపసర్పంచ్ రాజేందర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులున్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మండలంలోని అజీజ్‌నగర్, మొయినాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ ఏఈ హమునాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా అజీజ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గండిపేట్ రోడ్డు, వీఆర్‌కే ఆసుపత్రి, హైదరాబాద్ పోలో రైడింగ్ క్లబ్, మృగవని రిసార్ట్స్, అజీజ్‌నగర్ చౌరస్తా, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే, మొయినాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చిలుకూరు, బాలాజీ టెంపుల్, ఇంద్రారెడ్డి కాలనీ, శివానగర్ కాలనీ, అప్పోజీగూడ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ

శంకర్‌పల్లి: అయ్యప్ప దేవాలయం నిర్మాణానికి దాతలు విరాళాలు అందించడం అభినందనీయమని బీఆర్ఎస్ నాయకుడు, శంకర్‌పల్లి మాజీ ఉపసర్పంచ్ సాత ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం అయ్యప్ప దేవాలయం నిర్మాణంలో భాగంగా మోకిలకు చెందిన దేవ్‌లానాయక్ రూ.11లక్షలు, శంకర్‌పల్లి పట్టణ కేంద్రానికి చెందిన మాశెట్టి రాఘవేందర్ రూ.1లక్ష, 80వేలు, ఏఎంసీ మాజీ చైర్మన్ మాణిక్యరెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప ఆలయం నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపు నిచ్చారు. గ్రామాల్లో అయ్యప్ప ప్రచారం రథం తిరుగుతోందని ప్రతి ఒక్కరు తమ కుటుంబం నుంచి విరాళాలు, కానుకలను అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు జంగయ్య, విష్ణువర్ధన్, రాఘవేందర్, గౌతం పాల్గొన్నారు.

చిరుధాన్యాల వాడకం ఎంతో మేలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

కొందుర్గు: ప్రతినిత్యం భోజనంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని చిరుధాన్యాలతో ఎంతో మేలు జరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి సూచించారు. మిషన్ మేరి లైఫ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. అలాగే, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని సూచించారు. మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రేవతి, ఏఎన్ఎం జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు వెంకటమ్మ, సుగుణ, ఇందిర పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను కలిసిన రాజశేఖర్‌రెడ్డి



ఖాదర్ బాషాను కలిసిన రాజశేఖర్‌రెడ్డి

శంకర్‌పల్లి: ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్ భాషాను శంకర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం డైరెక్టర్ కె.రాజశేఖర్ రెడ్డి బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎంతో బాగున్నాయని అన్నారు. తెలంగాణలో కూడా ఆంధ్రప్రదేశ్ పథకాలను చేపట్టాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జంగయ్య ఉన్నారు.

సమస్యలు లేని గ్రామాలుగా మారుస్తా



కక్కులూర్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య, అవినాష్‌రెడ్డి

ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కక్కులూర్‌లో జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డితో కలిసి శుభోదయం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. మండలంలో సమస్యలు లేని గ్రామాలుగా మారుస్తామన్నారు. సంబంధిత అధికారులు సైతం తనతో ఉంటారని ప్రజల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణం, విద్యుత్ సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని చెప్పారు. తర్వలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితీ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ మమత, ఎంపీటీసీ కరుణాకర్, ఎంపీడీఓ అనురాధ, ఏఈలు శ్రీదివ్య, శారద, లక్ష్మన్‌నాయక్, ఏపీఓ వీరాసింగ్, ఏపీఎం నర్సింహులు తదితరులున్నారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

మున్సిపల్ చైర్మన్ నరేందర్

షాద్‌నగర్: పట్టణ పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 20వ వార్డులో వార్డు కౌన్సిలర్ మహేశ్వరి ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కాలనీల్లోని వీధులు, సీసీ రోడ్లు శుభ్రం చేయడం, మురుగు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగించడం జరుగుతుందన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయవద్దని సూచించారు. చెత్తను సేకరించేందుకు మున్సిపాలిటీ నుంచి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమంలో ప్రజలందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడ వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ డైరెక్టర్ గోపాల్, మహావీర్ లాహోటీ, ఎంసాని శ్రీనివాస్, బస్వరాజ్, లింగం, మంజుల, సత్యలక్ష్మి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న నరేందర్

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

ఎంపీపీ రవీందర్ యాదవ్

కేశంపేట: యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీపీ ఎల్లనమోని రవీందర్ యాదవ్ అన్నారు. మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో గత వారం రోజులుగా మండలస్థాయి క్రికెట్‌పోటీలు నిర్వహించారు. బుధవారం పోటీల్లో గెలుపొందిన వారికి ఎంపీపీ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను గుర్తించి వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. యువత క్రీడలను సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను చాటాలన్నారు. క్రికెట్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన కేశంపేట జట్టుకు రూ. 20వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన లేమామిడి జట్టుకు రూ.10వేల, షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో కేశంపేట, లేమామిడి, పుట్టోనిగూడ గ్రామాల సర్పంచులు వెంకట్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, జగన్‌నాయక్, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న రవీందర్ యాదవ్

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్యారడైజ్ కాలనీకి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయ్యాక బీఆర్ఎస్ ప్రభుత్వం బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సంక్షేమ ఫలాలు అర్హులకు అందినప్పుడే ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో మొయిజుద్దీన్, అష్రఫ్‌హుస్సేన్, అన్వర్, ఈర్షద్, సోహెల్ హుస్సేన్, షాబాజ్ అహ్మద్, ఆరిఫ్ అజీజ్, రోషన్ కుమార్‌సింగ్, రహన్ హుస్సేన్, అనస్, జహీర్, బాబుస్, అక్బర్, అలీ, అఫ్నాన్, జహంగీర్, అమీర్, వహీద్, రియాజ్, భరత్ దేవా ఉన్నారు.



షాద్‌నగర్: ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

సంప్రదాయాలను కాపాడుకోవాలి

కేశంపేట: సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపేటలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తిభావం కల్గి ఉండాలన్నారు. గ్రామస్తులు అందరూ కలిసిమెలసి పండుగలను జరుపుకోవాలని సూచించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ రవీందర్ యాదవ్ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నవీన్‌కుమార్, వీర్లపల్లి శంకర్, బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, మల్లేశ్‌యాదవ్, జగదీశ్వర్, లక్ష్మీనారాయణగౌడ్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి అండగా మేదర సంఘం

మొయినాబాద్: ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు కాలిపోయి రోడ్డున పడ్డ పేద కుటుంబానికి మేదర సంఘం అండగా నిలిచింది. దాతల సహకారంతో నెల రోజుల్లో వారికి కొత్త ఇళ్లు నిర్మించి ఇచ్చి బుధవారం గృహ ప్రవేశం చేయించారు. మండలంలోని చిలుకూరు రెవెన్యూ పోలీస్‌స్టేషన్ సమీపంలో మమతరాజు కుటుంబం వెదురు కట్టెలు విక్రయిస్తూ జీవనం సాగించేవారు. ఏప్రిల్ 5న షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని ఇళ్లు కాలిపోయింది. దీంతో మేదర సంఘం నాయకులు దాతల సహకారంతో నెల రోజుల వ్యవధిలో కొత్త ఇళ్లను నిర్మించి ఇచ్చారు. మానవతా దృక్పథంతో ఇంటి నిర్మాణానికి కృషి చేసిన మేదర సంఘం నేతలను అభినందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగరాజు, యాదయ్య, రవి, ఎల్లయ్య, కనకరాజు, భిక్షపతి, కుర్మంతు, శ్రీశైలం, రాజశేఖర్ పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం 'కంటి వెలుగు'

నందిగామ: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు దేశానికే ఆదర్శంగా నిలిచిందని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. మండలంలోని చేగూరులో సర్పంచ్ సంతోష ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి గణేశ్, ఎంపీపీ ప్రియాంక హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కంటి వెలుగును ప్రవేశపెట్టారని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులు, అద్దాలు పంపిణీ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, ఉప సర్పంచ్ అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు శివలీల, మంజుల పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది అలసత్వంపై ఆగ్రహం

షాద్‌నగర్: ఆరోగ్య సిబ్బందిపై డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఫరూఖ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రిజిస్ట్రేషన్ల నమోదు తక్కువగా ఉండడంతో ఆరోగ్య సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పీపీ యూనిట్‌కు సంబంధించిన ఆశవర్కర్లందరు ఇంటింటి సర్వే చేయాలని సూచించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారిని శిబిరాలకు తరలించి పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి రోజు కంటి వెలుగు శిబిరంలో రెండు వందల మందికి కంటి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్లు స్రవంతి, ప్రకాశ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్ వైజర్ అమృత, అష్టమాలజిస్టు తుకారాం, అశ్విని, భారతి, ఏఎన్‌యం స్వప్న తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించిన జయలక్ష్మి

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



కల్యాణమహోత్సవంలో పాల్గొన్న స్వప్న, తదితరులు

మొయినాబాద్ రూరల్: దైవ చింతన, భక్తిభావం ప్రజల్లో పెంపొందుతుందని రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల అన్నారు. బుధవారం మండలంలోని హిమాయత్‌నగర్ సోమేశ్వర దేవాలయంలో శివపార్వతుల కళ్యాణం మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమేశ్వర ఆలయ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ చైర్మన్ జంగం యాదవ్, కమిటీ సభ్యులు కలిసి శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వేద పండితుల మధ్య మంత్రోర్ఛరణాలతో అంగరంగ వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ జిల్లా నాయకులు ముదిగొండ రాజయ్య, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు శ్రీహరియాదవ్, బీఆర్ఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న, గణేష్, సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల, ఆలయ కమిటీ సభ్యులు సతీష్, శివరాజు, గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పదవి నుంచి ఎందుకు తప్పించారో చెప్పాలి?



విలేకరులతో సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీకాంత్, యూత్ నాయకులు

- ఎమ్మెల్యే తీరుతో కార్యకర్తలు అసహనం
- నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి ఆగ్రహం

చేవెళ్ల: పదవులు ఉన్న లేకపోయినా పార్టీ కోసం పని చేస్తున్నామని, పదవులు ముఖ్యం కాదని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం యూత్ మాజీ అధ్యక్షుడు వనం లక్ష్మీకాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కాలె యాదయ్య తన నియోజకవర్గం యూత్ అధ్యక్ష పదవీ నుంచి రెండు రోజుల క్రితం తొలగించి వేరే వ్యక్తులకు ఇచ్చినట్లు ప్రకటించారు. నేను పార్టీలోనే ఉన్నాను.. పార్టీకోసం పనిచేస్తున్నాను.. నా వల్ల ఇబ్బంది ఉంటే కనీసం సమాచారం ఇవ్వకుండా పదవి నుంచి ఎలా తప్పిస్తారో ఎమ్మెల్యేనే సమాధానం చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం యువతతో కలిసి పార్టీ కోసం తను పని చేశానా లేదో ఎమ్మెల్యేనే బహిరంగంగా చెప్పాలన్నారు. పార్టీలో భేదాభిప్రాయాలున్నాయని, ఎమ్మెల్యే తీరుతో సీనియర్ నాయకులు పార్టీలో ఇమడలేని పరిస్థితి కొనసాగుతోందన్నారు. తాము ఎమ్మెల్యే కంటే ముందు నుంచే పార్టీలో ఉన్నామని, పార్టీ ఆదేశాలను పాటిస్తామని చెప్పారు. కేఎస్ రత్నం ఆధ్వర్యంలో పార్టీని ముందుకు తీసుకుపోతామని చెప్పారు. ఈ సమావేశంలో ఐదు మండలాలకు సంబంధించిన యూత్‌సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి సమాచారం లేదు

సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం 111 జీఓను తొలగించారు. జీఓ పరిధిలోని తమ గ్రామాల ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యే, కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్లిన కూడా తమ గ్రామాల ప్రజలకు నాయకులకు సమాచారం ఇవ్వకపోవటం విడ్డూరంగా ఉందన్నారు.

సంక్షిప్త వార్తలు

● ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే 111 ప్రకటన

చేవెళ్ల: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ లబ్ధి పొందేందుకే జీఓ 111ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటన చేశారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తుండడంతో మళ్లీ ఈప్రాంతంలోని ప్రజల ఓట్లు పొందేందుకు 111 జీఓను ఎత్తివేస్తున్నట్లు హడావిడిగా ప్రకటన చేశారని తెలిపారు. ఈ జీఓ తొలగిస్తే ఈసీ, మూసీ వరదల వల్ల హైదరాబాద్‌కు ప్రమాదం పొంచి ఉందన్నారు. గతంలో 69జీఓను తీసుకువచ్చిన విషయాన్ని మరిచిపోయారా అన్ని ప్రశ్నించారు. 34వేల ఎకరాల అసైన్డ్ భూములను అమ్మి లాభం పొందేందుకు సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ జీఓను ఎత్తివేయడం అనేది సాధ్యం కానిదని చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

● రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే పుట్టగతులుండవు

మొయినాబాద్: బీఆర్ఎస్ నాయకులు నోటికొచ్చినట్లు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే వారికి పుట్టగతులు ఉండవని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, ఎంపీటీసీ రాంరెడ్డి, నాయకుడు కేబుల్ రాజు అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 111 జీఓ విషయంలో రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. జీఓను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని సార్లు ఎత్తేస్తుందని.. ఎన్నిసార్లు సీఎం కేసీఆర్‌కు పాలాభిషేకం చేస్తారని ప్రశ్నించారు. ఈ విషయాలపై రేవంత్‌రెడ్డి మాట్లాడితే ఆయనకు పిచ్చిపట్టిందని.. ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స చేయించాలని వెంకట్‌రెడ్డి విమర్శిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు.

● ప్రజాగర్జన సభను విజయంతం చేయండి

చేవెళ్ల: సీపీఐ పార్టీ జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో నిర్వహించనున్న 'సీపీఐ ప్రజా గర్జన' భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గం కన్వీనర్ కె.రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణలు అన్నారు. బుధవారం మండలకేంద్రంలో చలో కొత్తగూడెం వాల్‌పోస్టర్‌ను పార్టీ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సత్తిరెడ్డి, ఎండి.మక్బూల్, శ్రీనివాస్, మంజుల, మల్లేశ్, అర్జున్, పాండు, సాయిలమ్మ ఉన్నారు.

● వీఓఏల సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె

చేవెళ్ల: వీఓఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండలకేంద్రంలోని మహిళా సమాఖ్య భవనం ఎదుట వీఓఏలు చేస్తున్న సమ్మెకు బుధవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 17 నుంచి వీఓఏలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. 29న హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

● 'పీపుల్స్‌మార్చ్'ను విజయవంతం చేయండి

కేశంపేట: జడ్చర్లలో నిర్వహించనున్న పీపుల్స్‌మార్చ్‌ను విజయవంతం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తపేటలో బుధవారం పీపుల్స్‌మార్చ్‌పై కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ గురువారం జడ్చర్లకు చేరుకోనుందన్నారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మండల పార్టీ అధ్యక్షుడు వీరేశ్, యాదయ్యయాదవ్, నర్సింలు, యాదయ్య, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.